క్లుప్తంగా

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు



పాలకవర్గాన్ని సన్మానిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీలో అభివృద్ధి పనులకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రూ.1.50 కోట్లు మంజూరుచేశారు. బుధవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆయనను సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూప తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, కమిటీ డైరెక్టర్లు కలిశారు. కొత్త పాలకవర్గాన్ని మంత్రి అభినందించి సత్కరించారు. అనంతరం సర్దాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సీసీరోడ్డు కాంపౌండ్‌వాల్‌కోసం మంత్రి దృష్టికి తీసుకెళ్లగా నిర్మాణానికి రూ.1.30కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా మంత్రికి ఏఎంసీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూప రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తులు ఆహ్వానం

గంభీరావుపేట: మండలంలోని దమ్మన్నపేట ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ విభాగాల్లో 40 సీట్ల చొప్పున ఉన్నాయన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ప్రవేశం పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు చేసుకోవడానికి తుది గడువు ఈనెల 20 అని ప్రిన్సిపాల్ తెలిపారు.

'భగీరథ' నీరు వృథా !




ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని సాయి బాబా కమాన్ వద్ద మిషన్ భగీరథ పైపులైన్ బుధవారం పగిలిపోయింది. దీంతో రహదారి వెంట ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. వేసవిలో నీరంతా వృథా అవుతుందని స్థానికులు వాపోతున్నారు. వెంటనే అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

హనుమాన్ ఆలయంలో పూజలు



ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని పాటిమీది ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం గణపతి, హోమం నిర్వహించారు. పూజా కార్యక్రమానికి ముందు హనుమాన్ విగ్రహాన్ని చందనంతో అలంకరించారు. కార్యక్రమంలో పూజారులు మూగు నాగరాజు శర్మ, సంతోష్, నాగరాజు, భక్తులు నర్ర శ్రీనివాసరెడ్డి, ప్రవీణ్, వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు



వేములవాడ రూరల్: వేములవాడ మండలంలోని హన్మాజీపేట పీహెచ్‌సీలో క్షయవ్యాధి గ్రస్తుల కుటుంబ సభ్యులకు సీవైటీబీ టెస్ట్ (స్కిన్ టెస్ట్) నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు, బరువు తగ్గడం, రాత్రి సమయంలో జ్వరం రావడం వంటి లక్షణాలు ఉన్నవారు ఈ పరీక్ష చేయించుకోవాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ దివ్యశ్రీ తెలిపారు. కార్యక్రమంలో టీబీ పర్యవేక్షకుడు గంగమరాజు, ఎస్టీఎస్ గంగాధర్, ల్యాబ్ టెక్నీషియన్ మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

నెట్‌వర్క్ అంతరాయం లేకుండా చేయాలి

ముస్తాబాద్: మండలకేంద్రంలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌లో తరచూ అంతరాయం కలుగుతోందని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి అన్నారు. అధికారులు చర్యలు తీసుకుని నెట్‌వర్క్‌లో అంతరాయం లేకుండా చూడాలని కోరారు. తరచూ ఎదురవుతున్న అంతరాయంతో బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

ముందుకుపారని మురుగు



మురుగుకాలువపై నిర్మించిన స్లాబ్‌లు



డ్రైనేజీలు దాటి నిర్మాణాలు

- డ్రైనేజీలు దాటి ఆక్రమణలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- వ్యర్థాలతో నిండిన డ్రైనేజీలు
- రోగాలబారిన ప్రజలు

గంభీరావుపేట: మండలకేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగునీటి కాలువలు వ్యర్థాలతో నిండి, పూడికతో నిండిపోవడంతో మురుగునీరు ముందుకుపారడం లేదు. రాత్రి వేళల్లో ప్రజలకు దోమలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఫలితంగా ప్రజలు రోగాల బారినపడిన పడుతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు తీసుకుంటున్న చర్యలు మొక్కుబడిగా ఉంటున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు.

డ్రైనేజీలు దాటి నిర్మాణాలు..

గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ ప్రధాన రహదారికి ఆనుకొని ఇరువైపులా డ్రైనేజీలు ఉన్నాయి. వివిధ దుకాణాల యజమానులు సైడ్ డ్రైనేజీలపై స్లాబ్ వేసుకున్నారు. కొందరు డ్రైనేజీ ఆనవాళ్లు కనిపించకుండా స్లాబ్‌లు వేసుకొని యథేచ్ఛగా రోడ్లుపైకి వచ్చేశారు. డ్రైనేజీ దాటి శాశ్వత నిర్మాణాలు చేపట్టినా అడిగేవారే లేకుండాపోయారు. డ్రైనేజీలపై స్లాబ్‌లు వేసి మరీ వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మరికొందరు డ్రైనేజీలను మూసివేసి వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ డ్రైనేజీ ఉందా... అని ఆశ్చర్యపోవాల్సిందే. ఇంత జరుగుతున్నా.. పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు మురుగుకాలువలు శుభ్రం చేసేందుకు వీల్లేకుండా మారింది. మురుగునీరు ముందుకు సాగడానికి ఆటంకం కలుగుతోంది.

కాలువల్లో దుకాణాల వ్యర్థాలు..

డ్రైనేజీ ఆక్రమణలతో ఈ ప్రాంతంలో తీవ్రంగా పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. వ్యాపారులు సైడ్ డ్రెయిన్లు ఆక్రమించుకోవడంతో పాటు దుకాణాల్లోని వ్యర్థాలను సైతం కాలువల్లోనే పడేయడంతో మురుగుకాలువలు వ్యర్థాలతో నిండిపోతున్నాయి. మురుగునీరు ముందుకు పారడం లేదు. వీటిని తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులకు వీలు కావడం లేదు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా మురుగునీటి ప్రవాహం నిలిచిపోయి రోడ్డుపైనే పారుతోంది. దుర్గంధం మధ్యనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



డ్రైనేజీలను మూసివేసి స్లాబ్‌లు వేసిన వారిపై చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. డ్రైనేజీల్లో వ్యర్థాలు వేయకుండా వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. వీలైన చోటల్లా కాలువలను ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తున్నాం.
– లక్ష్మణ్, పంచాయతీ ఈవో, గంభీరావుపేట

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి



అంకుషాపూర్‌లో తడిసిన ధాన్యం చూపుతున్న రైతులు

తంగళ్లపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జాప్యం కారణంగా రైతులు నష్టపోతున్నారని అకాలవర్షాలతో ధాన్యం తడిసిందని కేటీఆర్ సేన మండల అధ్యక్షుడు నందగిరి భాస్కర్ గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని అంకుషాపూర్‌లో అకాలవర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..తడిసిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే కేటీఆర్ సేన ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. జిల్లెల్లలో ధాన్యం బస్తాలు తడవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



బోయినపల్లి: కరీంనగర్‌లోని శ్రీ రాజరాజేశ్వర ఉభయ వేదాంత సంస్కృత పాఠశాలలో 1980 నుంచి 2013 వరకు చదివిన విద్యార్థులంతా కలిసి మండలంలోని నీలోజిపల్లి కమ్యూనిటీ హాల్‌లో బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఒకరికొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలో పెద్దవేణి శ్రీనివాస్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం చోరీకి పాల్పడ్డారు. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముద్రకోల అంజలి ఆత్మహత్య చేసుకోగా, విషయం తెలుసుకున్న శ్రీనివాస్ అంత్యక్రియలకు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు శ్రీనివాస్ ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న నగదు, బంగారం, విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు విచారణ చేపట్టారు.

పొంచి ఉన్న ప్రమాదం



వీర్నపల్లి: మండలకేంద్రం నుంచి వన్‌పల్లి, మద్దిమల్ల గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. రంగంపేట గ్రామ పరిధిలో గత ఏడాదిలో కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు పక్కనున్న మట్టి కొట్టుకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టకపోతే రాత్రివేళ వాహనదారులు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు వర్షాలకు కొట్టుకుపోయిన మట్టిని కల్వర్టుల పక్కన నింపాలని మండలవాసులు కోరుతున్నారు.

మళ్లీ కొలతలు వేస్తాం



కోరుట్లపేటలో విచారణ చేపడుతున్న అధికారులు

- ఉపాధిహామీ కూలీలకు న్యాయం చేస్తాం
- ఏపీవో కొమురయ్య

ఎల్లారెడ్డిపేట: ఉపాధిహామీ కూలీలు గత వారం రోజులపాటు చేసిన పనులను తిరిగి కొలతలు వేస్తామని, పనికి తగిన వేతనం వచ్చేలా చూస్తామని ఏపీవో కొమురయ్య పేర్కొన్నారు. మండలంలోని కోరుట్లపేటలో వేతనం తగ్గించారని ఉపాధిహామీ కూలీలు మంగళవారం పని స్థలంలో నిరసన తెలిపిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఏపీవో కొమురయ్య కోరుట్లపేటలో బుధవారం విచారణ చేపట్టారు. ఎండలోనూ పనిచేసినా టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్ తన ఇష్టారీతిగా కొలతలు వేయడంతో వేతనంలో నష్టపోతున్నామని ఉపాధిహామీ కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనిచేయని కూలీల ఖాతాల్లో జమయిన డబ్బులు రికవరీ చేయాలని కూలీలు డిమాండ్ చేయగా త్వరలో గ్రామంలో జరిగే సోషల్ ఆడిట్‌లో రికవరీ చేస్తామన్నారు. మాజీ టెక్నికల్ అసిస్టెంట్ రాజు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ మేడిపల్లి లక్ష్మి ఉన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్‌కు మెమో

కోరుట్లపేటకు చెందిన ఉపాధిహామీ కూలీలు తమకు వేతనాలు సరిగ్గా రావడం లేదని, టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్ నిర్లక్ష్యంతోనే తాము నష్టపోతున్నామని మంగళవారం నిరసన తెలిపిన విషయం తెలిసిందే. దీన్ని సీరియస్‌గా తీసుకున్న అధికారులు టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్‌కు బుధవారం మెమో జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యానికి గల కారణాలు తెలపాలని మెమోలో సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్ల: పట్టణంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ బుధవారం తెలిపారు. పట్టణంలోని నాలుగవ ఫీడర్ 11 కేవీ. లైన్ మెయింటనెన్స్ కారణంగా శాంతినగర్, శ్రీనగర్ కాలనీ, ధోబీగల్లీ, సిద్ధార్థనగర్, అంబేద్కర్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

గ్రామాల్లో రేషన్ బియ్యం అందించాలి

- ఐద్వా జిల్లా కార్యదర్శి జవ్వాజి విమల



మాట్లాడుతున్న జవ్వాజి విమల

సిరిసిల్లటౌన్: ప్రతీనెల మొదటి వారంలో రావాలసిన రేషన్ బియ్యం 15వ తేదీ గడుస్తున్నా పల్లెల్లో రాలేదని ఐద్వా జిల్లా కార్యదర్శి జవ్వాజి విమల పేర్కొన్నారు. సిరిసిల్లలోని పార్టీ ఆఫీసులో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో చాలా మంది పేదలు రేషన్ బియ్యంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. రేషన్ బియ్యం రాక మార్కెట్లో కొనే స్థోమత లేక చాలా మంది పేదలు ఇబ్బంది పడుతున్నారన్నారు. లలిత, వందన, ఎల్లవ్వ, షీలా, లక్ష్మి పాల్గొన్నారు.

సీపీఐ జెండా ఆవిష్కరణ



మాట్లాడుతున్న కడారి రాములు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం సంకెపల్లిలో సీపీఐ జెండాను బుధవారం ఆవిష్కరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కడారి రాములు మాట్లాడుతూ గతంలో సీపీఐ ఎమ్మెల్యే రాజేశ్వర రావు ఎన్నో ఎకరాల భూమిని పేద ప్రజలకు అందించారన్నారు. పేదలకోసం పరితపించిన పార్టీ సీపీఐ పార్టీ అన్నారు. కార్యక్రమంలో నాయకులు పోచమల్లు, అంజయ్య, చంద్రయ్య, రాములు, మహేందర్, దేవయ్య తదితరులు ఉన్నారు.

చిన్నపాటి వర్షానికే రోడ్లు చిత్తడి..

వేములవాడరూరల్: చిన్నపాటి వర్షానికే వేములవాడ రూరల్ మండలంలో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. మండలంలోని మర్రిపల్లి వద్ద నూతనంగా నిర్మించిన బ్రిడ్జి వద్ద మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డు బురదమయంగా మారింది. దీంతో వాహనదారులు, గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగా వదిలివేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాహనదారులు పేర్కొన్నారు.



మర్రిపల్లిలో బురదమయంగా రోడ్డు



ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం ఎదుట విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఇటీవలే పైపులైన్ పక్కనే నూతనంగా విద్యుత్ లైన్ వేశారు. విద్యుత్ స్తంభం వేసే క్రమంలో పైపులైన్ పగిలిపోయింది. అప్పటి నుంచి నీరు ఇలా వృథాగా పోవడమే కాదు. విద్యుత్ స్తంభం కింద పెద్ద గొయ్యి ఏర్పడింది. ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
చంద్రమౌళి, సెల్‌నెంబర్: 9440811402 విద్యుత్ శాఖ డీఈ, ముస్తాబాద్

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

ఘనంగా బీరప్ప కల్యాణం



పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

వేములవాడరూరల్: బీరప్ప ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్ మండలం నమిలిగుండుపల్లి, బాలరాజ్ పల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న బీరప్ప కల్యాణ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నర్సింహారావు వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం బాలరాజుపల్లిలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, మాజీ చైర్మన్లు గడ్డం హన్మాండ్లు, ఏనుగు మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రంగు వెంకటేశం గౌడ్, బండ మల్లేశం, కాంగ్రెస్ రూరల్ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, సోయినేని కరుణాకర్, సంగ స్వామి, బండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో బంద్ పాక్షికం



బుధవారం ఉదయం వేములవాడలో మూసి ఉన్న దుకాణాలు

వేములవాడ: ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా గుడిని మూసివేయొద్దని కోరుతూ బుధవారం చేపట్టిన వేములవాడ బంద్ పాక్షికంగా సక్సెస్ అయింది. రాజన్న ఆలయ పరిరక్షణ సమితి ఇచ్చిన పిలుపుతో మధ్యాహ్నం 12 గంటల వరకు వ్యాపారులు తమ దుకాణాలు మూసివేసి ఉంచారు. అభివృద్ధికి సహకరించాలని కాంగ్రెస్ నాయకుల పిలుపుతో మధ్యాహ్నం నుంచి దుకాణాలు తెరిచారు.



ఘనంగా పోచమ్మ బోనాలు

కోనరావుపేట: మండలంలోని నాగారంలో మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో నల్ల పోచమ్మ బోనాల పండుగ బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలు నెత్తిన బోనంతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మకు నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోయినపల్లి: మండలంలోని కొత్తపేట గ్రామ పరిసరాల్లో ఇసుకరవాను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు రెవెన్యూ అధికారులు బుధవారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని తహసీల్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్ఐ మనోజ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

శతాధిక వృద్ధుడి మృతి

కోనరావుపేట: మండలంలోని మరిమడ్ల గ్రామానికి చెందిన గడప వెంకన్న (102) మంగళవారం రాత్రి మృతిచెందాడు. వెంకన్న భార్య సత్తవ్వ గతేడాది మృతిచెందగా కుమారులు దేవేందర్, రవీందర్, కూతుళ్లు భారత, పుష్పలత ఉన్నారు.

మూడు దుకాణాలకు రేషన్ బియ్యం

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలంలోని మూడు చౌకధరల దుకాణాలకు రేషన్ బియ్యం చేరాయి. మండలంలో 33 రేషన్ దుకాణములు ఉండగా బుధవారం ఇల్లంతకుంటలోని రెండు షాపులు, జంగారెడ్డిపల్లె చౌకధరల దుకాణాలకు బియ్యం చేరాయి. ప్రతీనెల 25నుంచి 30 వరకు చౌకధరల దుకాణాకలు బియ్యం చేరుతాయని ఒకటో తేదీ నుంచి 15 వరకు బియ్యం పంపిణీ చేస్తామని మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బాలకిషన్ తెలిపారు. మండలంలో మూడు దుకాణాలకు మాత్రమే రేషన్ బియ్యం వచ్చాయని, ఇంకా 30 రేషన్ షాపులకు బియ్యం రాలేదన్నారు.



ఇల్లంతకుంట రేషన్ దుకాణంలో బియ్యం